
## సర్కార్ బడుల్లో నో బ్యాగ్ డే
2





2
## హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## ప్రజలు నిబంధనలు పాటించాలి..సీపీ

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రజలు నిబంధనలు పాటించాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్టించరాదని పేర్కొన్నారు. ముఖ్యంగా జనంరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయొద్దన్నారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎక్కువశబ్దంతో డీజేలను ఏర్పాటు చేయొద్దన్నారు. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ అనుమతి తప్పనిసరి అని సూచించారు.


31-8-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




# పిరికిదాన్ని కాదు..

# పిడికిలి బిగించి వచ్చా..

రాష్ట్రంలో బంగారు తెలంగాణ కాదని.. బహుజన తెలంగాణ రావాలని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం తర్వాత జిల్లాకు మొదటిసారి వచ్చిన ఆమె పాత కలెక్టరేట్‌లో నిర్వహించిన పాంచజన్య సభలో ప్రసంగించారు. సంబంధం లేని కేసులో జైలుకు వెళ్లి వచ్చాక పుట్టినిల్లు వెళ్లగొడితే మెట్టినిల్లయిన నిజామాబాద్ ప్రజలే అక్కున చేర్చుకున్నారని కన్నీటి పర్యంతమయ్యారు.

– అక్షరటుడే, ఇందూరు

■ ఏ తప్పు చేయకుండానే జైలులో పెట్టారు ■ తండ్రి కూతురిని పాపిన ప్రశాంత్‌రెడ్డి ■ టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

కాళేశ్వరంతో జిల్లాలో ఒక్క ఎకరమైనా పండిందా.. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరం అయినా పండిందా అని కవిత ప్రశ్నించారు. అలాంటి ప్రాజెక్ట్ కట్టి ఎందుకు కవిత ప్రశ్నించారు. తెలంగాణలో సమస్యలు పరిష్కారం కావాలంటే కొత్త శక్తి రావాల్సిందేనన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఎవరి బతుకులు మారలేదన్నారు. కొత్త రాజకీయ శక్తిగా ఎదిగేందుకు నిజామాబాద్ ప్రజలు ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు.

**ఒక్కొక్కరి అవినీతి బయటకు తీస్తా...**

ఇందూరులో ఎమ్మెల్యేల అవినీతి బాగోతాలు అన్నీ బయటకు తీస్తానని కవిత పేర్కొన్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి అక్రమంగా చేస్తున్న ఇటుక దందాను. అర్బన్‌లో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కాంగ్రెస్ నాయకులతో కలిసి కుమ్మక్కై కడుతున్న బిల్డింగ్‌ల బాగోతాలు బయట పెడతానన్నారు. అలాగే ప్రశాంత్‌రెడ్డి అక్రమ క్వారీలు, గంజాయి దందాను అధారాలతో చూపిస్తానని పేర్కొన్నారు.

**కన్నీటి పర్యంతమైన కవిత..**

తానే ఏం తప్పు చేశానని తీహార్ జైల్లో పెట్టారని కవిత ప్రశ్నించారు. నాలుగేళ్లు ఈడీ, సీబీఐ తనను వేధించాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఏ తప్పు చేయలేదు కాబట్టే సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఏకంగా సీబీఐ అధికారిపైనే ఎంక్వైరీ వేయించారన్నారు. అయితే చేయని తప్పుకు జైలుకు వెళ్తే.. కడుపులో పెట్టుకోవాల్సిన పుట్టినిల్లు లాంటి పార్టీ తనను గెంటేసిందన్నారు. తన అత్తిల్లు అయిన ఇందూరు అక్కున చేర్చుకుందన్నారు.

**ప్రశాంత్‌రెడ్డికి ఉసురు తగులుతది..**

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదని కవిత అన్నారు. అధికార పక్షాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం ఏం చేస్తోందని బీఆర్ఎస్‌ను దుయ్యబట్టారు. అందుకే ప్రజల పక్షాన ప్రశ్నించేందుకే తాను వచ్చానన్నారు. బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిపై కవిత నిప్పులు చెరిగారు. తండ్రీ కూతురిని విడదీసిన ఉసురు తగులుతుందన్నారు. ప్రశాంత్‌రెడ్డిని జీవితంలో క్షమించేదని లేదన్నారు. పైగా ప్రశాంత్‌రెడ్డి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోగానే ముకందరెడ్డి అనే వ్యక్తితో కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు బేరసారాలు ఆడారని ఆరోపించారు. తాను ఎంపీగా నిలబెడితే అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కక్షకట్టి ఓడించారన్నారు.

**కాంగ్రెస్‌లో చేరేందుకు అర్వింద్ ప్రయత్నాలు**

ఎంపీ అర్వింద్‌కు ఇందూరుపై ఏం బాధ్యత ఉందని కవిత ప్రశ్నించారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రయత్నం చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రం రేవంత్‌రెడ్డి రౌడీయిజం చేస్తున్నారని.. మాట్లాడితే బూతులు తప్ప వేరే ముచ్చట లేదని అన్నారు. టీఆర్ఎస్ స్థాపించింది బంగారు తెలంగాణ కోసం కాదని బహుజన తెలంగాణ కావాలన్నారు. కేసీఆర్‌ను సిద్దిపేట అక్కున చేర్చుకున్నట్లుగా.. బహుజన తెలంగాణ కోసం బయటకు వచ్చిన తనకు ఇందూరు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.



**'పాంచజన్యం'తో మీ ముందుకు..**


తెలంగాణ రాష్ట్ర ఆదాయం రూ.2 లక్షల కోట్లని.. దాంతో అద్భుత ప్రగతి సాధించవచ్చని కవిత పేర్కొన్నారు. ఒక్క లక్ష కోట్లు ఖర్చు పెడితే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించవచ్చన్నారు. అందుకే టీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాంచజన్య పథకాలను ప్రకటిస్తున్నామన్నారు. ఉచిత విద్య ,ఉచిత వైద్యం , సామాజిక న్యాయం, వ్యవసాయం, ఉపాధి ఇవే మా పాంచ జన్య సూత్రాలను సభాముఖంగా ప్రకటించారు. రాష్ట్రంలో భూమిలేని నిరుపేద కుటుంబానికి టీఆర్ఎస్ ప్రభుత్వంలో భూలక్ష్మి కింద ఒక ఎకరం భూమి ఇస్తామని పేర్కొన్నారు. 22ఏ ద్వారా ప్రభుత్వం సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీపై కేసీఆర్ హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. కేటీఆర్ స్నేహితుడికి ఆ ఫ్యాక్టరీని అప్పజెప్పే కుట్ర జరిగిందని ఆరోపించారు.



## స్మార్ట్ రేషన్ కార్డులు ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు

**అక్షరటుడే, కామారెడ్డి:** స్మార్ట్ రేషన్ కార్డులు ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో వనమహోత్సవం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ హన్మంతరావు, కౌన్సిలర్లు లలిత చిట్టిబాబు, అంజాద్, వాజీద్, బబ్లు, జావీద్, సిద్దిక్, సత్యం, భాస్కర్ గౌడ్, మున్సిపల్ అధికారులు అక్తర్, వార్డు ఆఫీసర్ వినయ్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్వో గీత, డీఆర్డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, ఏసీపీ శ్రీశైలంలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లింగంపేట్ ఎంపీడీవో బ్రహ్మానందంకు వీడ్కోలు



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా పరిషత్ కార్యాలయంలో లింగంపేట్ ఎంపీడీవో బ్రహ్మానందం వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం జడ్పీ సీఈవో చందర్ అధ్యక్షతన, కామారెడ్డి జిల్లా ఎంపీడీవోల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఎంపీడీవోలు, జిల్లా పరిషత్ సిబ్బంది ఎంపీడీవోను సన్మానించారు. అనంతరం జడ్పీ సీఈవో మాట్లాడుతూ.. ఎంపీడీవో బ్రహ్మానందం ప్రభుత్వ సేవలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి సురేందర్, ఎంపీడీవోల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గోపి బాబు. గాంధారి, నస్రుల్లాబాద్, బీబీపేట్, తాడ్వాయి, కామారెడ్డి, పెద్దకొడప్‌గల్, బీర్కూర్, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, సదాశివనగర్, మాచారెడ్డి మండలాల ఎంపీడీవోలు, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఉచిత నేత్ర పరీక్ష శిబిరం



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఉచిత నేత్ర పరీక్ష శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. నేత్రదాన ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ విక్టర్ ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులతో 175 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 113 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. దైనందిన జీవితంలో కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిజిటల్ తెరల వల్ల కలిగే కంటి అలసట నివారణపై అవగాహన కల్పించారు. అంధత్వ నివారణలో నేత్రదానం ప్రాముఖ్యతను వివరించి అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట్, ఆప్తాల్మిక్ అధికారులు రవీందర్, హరికిషన్, వైద్యులు మారుతి బాబు, సంతోష్, ఆశాలు, ఏఎన్ఎంలు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## పలువురు హెడ్‌కానిస్టేబుళ్లకు పదోన్నతులు.. అభినందించిన సీపీ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు హెడ్ కానిస్టేబుళ్లు ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారిని సీపీ సాయిచైతన్య ప్రత్యేకంగా అభినందించారు. కమిషనరేట్ పరిధిలో పదకొండు మంది హెడ్‌కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పిస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారంతా సీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సాయిచైతన్యను మర్యాదపూర్వంగా కలిశారు. వారిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. పదోన్నతుల బాధ్యత మరింత పెరిగిందని.. నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు. గంగాధర్ రావు (నందిపేట), రాజేశ్వర్ (ఉమెన్ పోలీస్ స్టేషన్), మోహన్ (సీసీఎస్ పోలీస్ స్టేషన్), జగదీశ్వర్ (పీసీఆర్), చిన్న సాయిలు (సీఎస్‌బీ), రాజశేఖర్ (డిచ్‌పల్లి), రాజేందర్ (సిరికొండ), సుదర్శన్ (నవీపేట్), డేనియల్ భాస్కర్ (టౌన్ వన్ పోలీస్ స్టేషన్), సుంకన్న (టౌన్ 2 పోలీస్ స్టేషన్), మల్లేశం (వర్ని) ప్రమోషన్ పొందిన వారిలో ఉన్నారు.

## గైని గంగారాం సేవలు మరువలేనివి: పీసీసీ చీఫ్



**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** ఉద్యోగ సంఘం నాయకుడిగా ఉద్యోగుల సంక్షేమానికి గైని గంగారాం చేసిన సేవలు మరువలేనివని వక్తలు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖలో విధులు నిర్వహిస్తూ సూపరింటెండెంట్‌గా రిటైర్ అవుతున్న గైని గంగారాం పదవీవిరమణ కార్యక్రమాన్ని నగరంలోని టీఎన్జీవోస్ జిల్లాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా ఛైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ గైని గంగారాం సేవలను కొనియాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఉద్యోగ సంఘాలు ప్రముఖ పాత్ర పోషించాయన్నారు. గైనిగంగారాం ఆధ్వర్యంలో ఉద్యోగులు సమరభేరి మోగించారని గుర్తు చేశారు. ఎంప్లాయిస్ చేసి రాష్ట్ర ఛైర్మన్ టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ హుస్సేని మాట్లాడుతూ టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. 1వ తేదీన కలెక్టరేట్‌లో భోజన విరామ సమయంలో నిరసన తెలిపాలని సూచించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, టీఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్, నరసింహారెడ్డి, గడుగు గంగాధర్, కేశ వేణు, కోలా శ్రీనివాస్, సతీష్, పెద్దోళ్ల నాగరాజు, నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గతేడాది ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి




**అక్షరటుడే, కామారెడ్డి:** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో గతేడాది జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి ఒక్క ఉత్సవ కమిటీ పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, శోభాయాత్రలపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. భక్తి మన బలం.. భద్రత మన బాధ్యత అనే స్ఫూర్తితో కామారెడ్డి జిల్లాలో గణేష్ ఉత్సవాలను సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవడం కామారెడ్డి జిల్లా ప్రత్యేకత అని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సోదరభావంతో నిర్వహించుకోవాలని కోరారు. ఈ ఏడాది ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా, ఎవరికీ గాయం కాకుండా ఉత్సవాలు జరుపుకోవాలని సంకల్పిద్దామన్నారు. గతేడాది మాచారెడ్డి మండలంలో విగ్రహ తరలింపు సమయంలో విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతి చెందగా, ఇందిరానగర్‌లో ముగ్గురు గాయపడ్డారని గుర్తు చేశారు. ఒక ప్రాణం కోల్పోవడం ఆ కుటుంబానికి జీవితాంతం తీరని లోటు అని, అలాంటి విషాదం మరే కుటుంబానికీ రాకూడదన్నారు. విగ్రహం పరిమాణానికి తగ్గట్టుగానే వేదిక ఉండాలని, రహదారులకు అడ్డంకులు సృష్టించవద్దని చెప్పారు. విగ్రహాలను తరలించే సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, విగ్రహం ఎత్తు, వాహనం ఎత్తు, దారిలో విద్యుత్ తీగలను ముందే పరిశీలించుకోవాలని, వేగం కంటే భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

## బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



**అక్షరటుడే, బోధన్ :** కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేందుకు సరిపడా బస్సులు లేవని నిరసిస్తూ విద్యార్థులు ధర్నాకు దిగారు. ఈ ఘటన బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. బోధన్ మండలం కల్దుర్కి గ్రామానికి సరిపడా బస్సులు నడపడం లేదని విద్యార్థులు ఆందోళనకు దిగారు. కళాశాల విద్యార్థులు సోమవారం వచ్చిన బస్సును ఆపి దాని ఎదుట ధర్నా చేశారు. సరిపడా బస్సులు రాకపోవడంతో నిత్యం కళాశాలలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందని వారు వాపోయారు. అదనపు బస్సులు కేటాయించాలని ఎన్నిసార్లు బోధన్ డిపో మేనేజర్‌ను కలసి వినతిపత్రం అందించినప్పటికీ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా డిపో మేనేజర్ స్పందించి అదనపు బస్సులు కేటాయించకపోతే గ్రామంలోనికి ఆర్టీసీ బస్సులు రానివ్వమని హెచ్చరించారు.



## హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని న్యూ బస్టాండ్ పరిసరాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతాధికారి జి.విక్రమ్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో ఆహార పదార్థాల తయారీ, నిల్వ విధానం, వంటశాలల పరిశుభ్రత, వినియోగిస్తున్న పరికరాలను పరిశీలించారు. తనిఖీల్లో కొన్ని హోటళ్ల వంటశాలలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. ఆహార తయారీలో స్టెయిన్ లెస్ స్టీల్ కత్తులకు బదులుగా ఇనుప కత్తులను వినియోగిస్తున్నట్లు తేలింది. నిబంధనలు పాటించని హోటల్, రెస్టారెంట్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. నోటీసుల్లో పేర్కొన్న సూచనలను నిర్ణీత గడువులోగా అమలు చేసి వంటశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, లేనిపక్షంలో ఆహార భద్రతా నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.

## సోమేశ్వరాలయంలో అన్నదానం



**అక్షరటుడే, బాన్సువాడ:** శ్రావణమాసం సందర్భంగా నస్రుల్లాబాద్ మండలం దుర్కి శివారులోని సోమేశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ సోమవారం కావడంతో ఉదయం నుంచే పరిసర గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసంలో సోమవారానికి విశేష ప్రాధాన్యం ఉండటంతో భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి శివుడిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా దుర్కి గ్రామానికి చెందిన దివిటి గోపి ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదానంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.



# సర్కార్ బడుల్లో

# 'నో బ్యాగ్ డే'

- ఖచ్చితంగా అమలుకు ఆదేశాలు..
- ఆ రోజుల్లో విద్యార్థులకు ఆటపాటలు
- ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం నిర్ణయం

**తెలంగాణ లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుండి పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ ఒక అద్భుతమైన తీపి కబురు అందించింది. ఇదివరకు ఇచ్చిన 'నోబ్యాగ్ డే' ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని ఆదేశాలు జారీ చేసింది.**

**– అక్షరటుడే, ఎల్లారెడ్డి**

విద్యార్థుల భుజాలపై భారీ పాఠశాల బ్యాగుల భారాన్ని తగ్గించడంతో పాటు, వారిలోని దాగివున్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రతినెలా మూడో శనివారం రోజున విధిగా 'నో బ్యాగ్ డే' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఉత్తర్వులు వర్తిస్తుంది. ఒక విద్యా సంవత్సరంలో మొత్తం 10 రోజులను 'నో బ్యాగ్ డేస్'గా కేటాయిస్తూ అకడమిక్ క్యాలెండర్‌లో పొందుపర్చారు.



### ప్రకటించిన ప్రధాన తేదీలు

విద్యాశాఖ షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 19, నవంబర్ 21, డిసెంబర్ 19, ఫిబ్రవరి 20, మార్చి 20 తేదీలను ప్రత్యేకంగా ప్రకటించారు. మిగిలిన రోజులను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలల యాజమాన్యాలు/హెచ్ఎంలు సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది.

### ఆ రోజుల్లో ఏం చేస్తారు?'

'నో బ్యాగ్ డే' నిర్వహించే శనివారాల్లో విద్యార్థులు ఎలాంటి పుస్తకాల బ్యాగులు లేకుండా ఉల్లాసంగా పాఠశాలలకు హాజరు కావచ్చు. సాంప్రదాయ తరగతి గది పాఠాలకు బ్రేక్ ఇచ్చి విద్యార్థులతో కింది కార్యకలాపాలు నిర్వహిస్తారు. విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించే వినోదాత్మక ఆటలు, క్విజ్ కార్యక్రమాలు. ప్రాక్టికల్ విజ్ఞానాన్ని పెంపొందించే ప్రయోగాలు చేయిస్తారు. స్థానిక పరిశ్రమలు లేదా క్షేత్ర స్థాయి పర్యటనలకు తీసుకెళ్తారు. విద్యార్థుల ఆసక్తులకు అనుగుణంగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్, చిత్రలేఖనం, నాటికలు, స్థానిక చేతివృత్తుల వారితో ముఖాముఖి వంటి విభిన్న సృజనాత్మక కృత్యాలు నేర్పిస్తారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసే బాధ్యతను ఆయా జిల్లాల డీఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ అప్పగించింది. ఈ నిర్ణయం పట్ల విద్యార్థులు మరియు తల్లిదండ్రుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమం తూచా తప్పకుండా అన్ని పాఠశాలలో పక్కాగా అమలు చేస్తే విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత బయటపడే అవకాశం ఉంటుంది. ప్రైవేట్ బడుల్లో కూడా దీనిని అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.



## తిమ్మాపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**అక్షర టుడే, ఎల్లారెడ్డి:** తిమ్మాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సోమవారం పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ డ్రెస్సుల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా, అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కూడా చేపట్టారు. సర్పంచ్ సోనీ ప్రకాష్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.




## విద్యార్థులకు బూట్లు..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు గండిమాసానిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. 6వ తరగతి నుండి పదో తరగతి వరకు చదివే 50మంది విద్యార్థులకు స్థానిక 5వ వార్డు కౌన్సిలర్ అటకారి చంద్రయ్య, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ వహీద్ చేతుల మీదుగా ప్రభుత్వం అందించే ఒక జత బూట్లు, సాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పరుష వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఆనంద్, సాయిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలి




**అక్షరటుడే, ఆర్మూర్ :** అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్మూర్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 30ఏళ్లుగా ఆర్మూర్ పట్టణంలో నిరుపేదలు ఇల్లు లేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదన్నారు. డబుల్ బెడ్ ఇళ్లు రాని నిరుపేదలందరికీ కూడా ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి రూ.పది లక్షల లోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుతాడి ఎల్లయ్య, రవి, నగేష్ గౌడ్, సాయిలు, అమీర్ ఖాన్, షాహిదా బేగం పాల్గొన్నారు.

## నూతన మండల సమాఖ్య పాలక వర్గం ఎన్నిక




**అక్షరటుడే మాక్లూర్:** ఇందిరా క్రాంతి పథం మాక్లూర్ మండల సమాఖ్య 19వ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ వెంకటేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. స్వయం సమృద్ధి దిశగా సంఘాల సభ్యులు సాధిస్తున్న ప్రగతి ప్రశంసనీయమని కొనియాడారు. ప్రభుత్వం అందించే వడ్డీలేని రుణాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శ్రీకన్య, కార్యదర్శి అక్బరీ, కోశాధికారి సుమలతలతో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నట్లు ఏపీఎం ఉమేష్ కుమార్ చెప్పారు. ఎన్నికల అధికారి ఐబీ ప్రసాద్ సమక్షంలో ఈ పాలక వర్గం ఎన్నిక జరిగినట్లు ఆయన తెలిపారు. నూతన పాలక వర్గాన్ని అభినందించారు.

## అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి : ముత్యాల సునీల్



**అక్షరటుడే, భీమ్‌గల్:** సమాజంలో వేళ్లూనుకున్న అసమానతలను రూపుమాపడానికి అంబేడ్కర్ తన జీవితాంతం కృషి చేశారని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని సుదర్శన్ నగర్ తండాలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సునీల్ అన్నారు. అంబేడ్కర్ అందించిన 'బోధించు, పోరాడు, సమీకరించు' అనే నినాదం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## బీఈడీ ఫలితాలు విడుదల



**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ 2024 బ్యాచ్ బీఈడ్ కోర్సు ఫలితాలను రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి విడుదల చేశారు. 1,354 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1,288 మంది ఉత్తీర్ణత సాధించారని, 95.12 శాతం ఫలితాలు నమోదైనట్లు సంపత్ కుమార్ తెలిపారు. ఫలితాలను తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సెట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్.. ఫోన్ తిరిగి అందజేత



**అక్షరటుడే, బాల్కొండ:** మండలం వన్నెల్ (బి) గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ ఇస్మాయిల్ నిజాయితీ చాటుకున్నారు. ఆర్మూర్ నుంచి బాల్కొండకు ప్రయాణికులను తీసుకొస్తున్న క్రమంలో ఆదివారం రాత్రి సుమారు 9 గంటలకు చిట్టాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద రోడ్డుపక్కన ఓ చరవాణి కనిపించింది. ఆటోలోని ప్రయాణికులను దింపుతున్న సమయంలో ఫోన్‌ను గుర్తించిన ఇస్మాయిల్ దానిని భద్రంగా తీసుకుని సోమవారం ఉదయం బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అనంతరం పోలీసులు ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అందజేశారు. ఆటో డ్రైవర్ ఇస్మాయిల్ నిజాయితీని అభినందించిన బాల్కొండ ఎస్సై కే. శైలేందర్ ఆయనకు చిరు ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇస్మాయిల్ లాంటి నిజాయితీపరులే సమాజానికి అవసరమని అన్నారు. ప్రజలు తమకు దొరికిన వస్తువులను పోలీసులకు అప్పగించాలన్నారు.

## రేణుక నగర్‌లో రోడ్డు పనులకు శ్రీకారం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని 27వ డివిజన్ పరిధిలోని రేణుక నగర్లో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గత 15 సంవత్సరాలుగా రహదారి సౌకర్యం లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పలువురు ప్రజాప్రతినిధులు మారినా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో 27వ డివిజన్ కార్పొరేటర్ కల్పే అర్చన చిరంజీవి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, స్వయంగా పర్యవేక్షిస్తూ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతం చేయడం పట్ల స్థానికులు తీవ్ర సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "మాటలు కాదు... చేతల్లో అభివృద్ధి" అనే నినాదాన్ని నిజం చేస్తూ తమ ప్రాంతంలో రోడ్డు పనులు ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ కల్పే అర్చన చిరంజీవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ డివిజన్ అభివృద్ధి ఇదే రీతిలో కొనసాగాలని ఆకాంక్షించారు.

## ఆహార కల్తీపై విద్యార్థి దశ నుంచే చైతన్యం అవసరం..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ఆహార కల్తీపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్ భుజంగరావును కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం చైతన్య కార్యక్రమాలకు సంబంధించి పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలల్లో ఆహార కల్తీ నష్టాలు, సురక్షిత ఆహార ప్రాముఖ్యత, వినియోగదారుల హక్కులపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు సమితి నాయకులు తెలిపారు. ఆహార భద్రతప్రమాణాల చట్టం, లీగల్ మెట్రాలజీ చట్టం, వినియోగదారుల రక్షణ చట్టంపై విద్యార్థులకు ప్రాథమిక జ్ఞానం అందించాలన్నారు. విద్యార్థులు ఆహార నాణ్యత, లేబులింగ్, గడువు తేదీ, బరువు కొలతలు, కల్తీని సులభంగా గుర్తించే పద్ధతులను తెలుసుకోవడం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని వారన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, నిజామాబాద్ జోనల్ కన్వీనర్ సందు ప్రవీణ్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు వి.ఎన్. వర్మ, మహాదేవుని శ్రీనివాస్, యాటకర్ల దేవేష్ తదితరులు పాల్గొన్నారు.